# కూటమి.. మొండి చెయ్యి

- సామాజిక న్యాయానికి కూటమి సర్కారు తూట్లు
- సొసైటీ త్రిసభ్య కమిటీల్లో పాటించని సమతూకం
- బీసీ, ఎస్సీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం


రామచంద్రపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ కార్యాలయం

**రామచంద్రపురం:** నామినేటెడ్ పదవుల్లో కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి చరమగీతం పాడింది. రామచంద్రపురం నియోజకవర్గంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీల నియామకంలో చైర్మన్లుగా ప్రభుత్వానికి అనుకూలంగా ఉండేవారినే నియమించారే తప్ప.. ఎక్కడా సామాజిక సమతూకం పాటించకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీసీలు అత్యధికంగా ఉండే ఈ నియోజకవర్గంలో వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం నియామకాలు చేపట్టింది. స్థానికంగా బీసీ మంత్రి అయి ఉండి కూడా పీఏసీఎస్‌లలో బీసీలకు తగిన ప్రాధాన్యం లేకపోవటం విమర్శలకు తావిస్తోంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో రామచంద్రపురం పట్టణం, రూరల్, కాజులూరు, కె.గంగవరం మండలాల్లో మొత్తం 29 సొసైటీలు ఉండగా.. వాటిలో దాదాపుగా సగానికి అంటే 15 సొసైటీల్లో బీసీలను చైర్మన్లుగా నియమించింది. అప్పటి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీలకు పెద్ద పీట వేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా గత ప్రభుత్వంలో బీసీలు 15, ఎస్సీలు 2, ఆర్యవైశ్యులకు ఒకటి, ఓసీ దొరలకు ఒకటి, క్షత్రియ సామాజిక వర్గానికి ఒకటి చొప్పున సొసైటీలు కేటాయించి పదవులు అందించారు. నియోజకవర్గ చరిత్రలో ఎస్సీలకు రెండు సొసైటీల్లో చైర్మన్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అవకాశం కల్పించింది.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మొత్తం 29 సొసైటీలకు 7 సొసైటీల్లో మాత్రమే బీసీలకు అవకాశం కల్పించారు. ఎస్సీలకు ఎక్కడా ప్రాధాన్యత లేకుండా పోయింది. కమ్మ సామాజిక వర్గానికి 7, కాపులకు 13 సొసైటీల్లో చైర్మన్లుగా నామినేటెడ్ చేశారు. ఇతర అగ్రవర్ణాల వారికి మొండి చెయ్యి చూపారు.

రామచంద్రపురం మండలంలో 9 సొసైటీలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 6 సొసైటీల్లో బీసీలను చైర్మన్లుగా నామినేట్ చేయగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కేవలం రెండు సొసైటీలకే బీసీలకు అవకాశం ఇచ్చింది. కె.గంగవరం మండలంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మొత్తం 11 సొసైటీల్లోని 5 సొసైటీల్లో బీసీలకు రెండు, ఎస్సీలకు మూడు కేటాయించగా.. కూటమి హయాంలో బీసీలకు రెండు దక్కగా.. ఎస్సీలకు ఒక్కటి కూడా ఇవ్వలేదు. ఇదిలా ఉండగా సొసైటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో మంత్రి సుభాష్ తండ్రి పాల్గొని నియామకపత్రాలను అందజేయటం కూడా వివాదాస్పదంగా మారింది.

## క్లుప్తంగా

### రేపు 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' సమావేశం


ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

**కపిలేశ్వరపురం:** 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' సమావేశాన్ని నగర స్థాయిలో మంగళవారం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని 19 గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని తోట కోరారు.

### నేడు మండపేటలో సమావేశం

**కపిలేశ్వరపురం (మండపేట):** 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ' సమావేశం మండపేట పట్టణం, రూరల్ గ్రామాల పరిధిలో సోమవారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ మండలాల సీనియర్ నాయకులు పిల్లి శ్రీనివాస్, అడబాల బాబ్జి ఆదివారం తెలిపారు. పట్టణంలోని విజయలక్ష్మి నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి పట్టణంలోని 30 వార్డులు, రూరల్ మండలంలోని 12 గ్రామాల వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

### అంధ విద్యార్థులకు చెస్ బోర్డులు అందజేత

**కపిలేశ్వరపురం (మండపేట):** పట్టణంలోని అంధుల పాఠశాలలోని విద్యార్థులకు మాస్టర్స్ చెస్ అకాడమీ నిర్వాహకులు ఆదివారం ఉచితంగా నాలుగు చెస్ బోర్డులను అందజేశారు. అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా చెస్ అకాడమి డైరెక్టర్ బీఎల్ఎస్ వరహాలు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అంధ విద్యార్థులు తమ చేతి స్పర్శతో చెస్ ఆడే వీలును కలిగి ఉన్న బోర్డుల ద్వారా సులభంగా చెస్ ఆడవచ్చన్నారు. అందులోని మెలకువలను విద్యార్థులకు నెలలో రెండు ఆదివారాల పాటు, ఉచితంగా నేర్పిస్తున్నట్టు వరహాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాణి, సిబ్బంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కొత్త బ్రేకర్‌తో సాంకేతిక సమస్యలకు చెక్


అంగరలో నూతన బ్రేకర్‌ను పరిశీలిస్తున్న కె.రత్నాలరావు

**కపిలేశ్వరపురం:** మండలంలోని అంగర 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రూ.10 లక్షల వ్యయంతో కొత్త 11కేవీ బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు. స్టేషన్‌లో బ్రేకర్ నిర్మాణ పనులను విద్యుత్ శాఖ రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నలరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ పర్యవేక్షించారు. సబ్‌స్టేషన్ ఏఈ ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలోని సిబ్బంది నిర్మాణ పనులను పూర్తి చేశారు. కె.రత్నాలరావు మాట్లాడుతూ అంగర ఫీడర్ బ్రేకర్ వినియోగంలోకి తీసుకొచ్చామని, దాని వల్ల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశాలు తగ్గుతాయన్నారు. మరో రూ.10 లక్షల వ్యయంతో వల్లూరు ఫీడర్ పరిధిలో నూతన బ్రేకర్ నిర్మాణ పనులు చేపట్టామని త్వరలో అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు.

### పదవులను బాధ్యతగా స్వీకరించాలి

**కాజులూరు:** పదవులను అలంకారప్రాయంగా కాకుండా బాధ్యతగా స్వీకరించినప్పుడే ఆ పదవికి న్యాయం చేస్తారని రాష్ట్ర మాజీ సహకార శాఖ మంత్రి చిక్కాల రామచంద్రరావు అన్నారు. పెనుమళ్ల పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవం ఆదివారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో ఘనంగా జరిగింది. మాజీ మంత్రి రామచంద్రరావు, వాసంశెట్టి సత్యం, కాకినాడ రామారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నూతన చైర్మన్‌గా నియమితులైన అయితపూడి మాజీ సర్పంచ్ కొల్లు వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్లుగా నియమితులైన బొక్కా అప్పన్న, కొన సుబ్రహ్మణ్యంతో ప్రమాణస్వీకారం చేయించి నియామక పత్రాలు అందజేశారు. పలువురు నాయకులు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యావటం పీఏసీఎస్ చైర్మన్ కోట తాతబ్బాయి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, డీసీ పేపకాయల బాబ్జి, మాజీ సర్పంచ్‌లు వనుం వీరబ్రహ్మం, చవ్వాకుల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### నిత్యం శ్రీకృష్ణుని స్మరణలో ఉండాలి


**అయినవిల్లి:** దేవాది దేవుడు శ్రీకృష్ణుని నామ స్మరణతోనే నిత్యం ఉన్నవాడే భగవాన్ శ్రీకృష్ణుని ధామం చేరుకుంటారని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్ ప్రభూజీ తెలిపారు. ఆదివారం నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో భగవాన్ శ్రీకృష్ణునికి సుందరశ్రీనివాస్ ప్రభూజీ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు.

## అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ


ముత్యాలమ్మకు సారె తీసుకొచ్చిన భీమేశ్వరాలయ అర్చకులు


పోలేరమ్మ

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని ద్రాక్షారామ సాక్షి వారి వీధిలో కొలువైన ముత్యాలమ్మ అమ్మవారికి మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయం నుంచి ఆలయ అర్చకులు, సిబ్బంది పట్టు చీర తీసుకురాగా.. గ్రామస్తులు ఆషాఢం సారెగా స్వీట్లు, పండ్లు సమర్పించారు. హసన్‌బాదలో గ్రామ దేవత ఇలింద్రమ్మ తల్లికి ఆడపడుచులు సారె అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


హసన్‌బాద ఇలింద్రమ్మ తల్లికి ఆషాఢ సారె

### పోలేరమ్మకి సారె సమర్పణ

**రాయవరం:** మండలంలోని మాచవరంలో పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం భక్తులు ఆషాఢం సారె సమర్పించారు. శ్రీహరికాలనీలోని సుమారు 200 మంది భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. మేళతాళాలతో ర్యాలీగా వెళ్లిన భక్తులు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి పలు రకాల స్వీట్లు, పండ్లు, పసుపు కుంకుమ, నైవేద్యాలను సారెగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## విరబూసిన బ్రహ్మకమలాలు


వికసించిన బ్రహ్మకమలం

**కాజులూరు:** మండలంలోని గొల్లపాలెంలో ఆదివారం బ్రహ్మకమలాలు విరబూసి ఆకట్టుకుంటున్నాయి. మండల వైఎస్సార్ సీపీ మహిళా విభాగ నేత, గొల్లపాలెం ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరి దేవి ఇంటి ఆవరణలో పెంచుతున్న పూల మొక్కల్లోని రెండు కుండీల్లో బ్రహ్మకమలాలు ఉన్నాయి. ఆకుల నుంచి పలు మొగ్గలు వేసి అవి విచ్చుకునే దశకు రావటంతో పరిసర ప్రజలు శనివారం రాత్రి మొక్కల వద్దకు చేరి ఆసక్తిగా చూశారు. ఆదివారం తెల్లవారుజామున రెండు కుండీల్లోని బ్రహ్మకమలాలు విచ్చుకుని కనువిందు చేశాయి. హిమాలయాల పర్వత ప్రాంతాల్లో కనిపించే ఈ బ్రహ్మకమలాలు సంవత్సరానికి ఒకసారి మాత్రమే అరుదుగా పుష్పాలు పూస్తాయని స్థానికులు చెబుతున్నారు. బ్రహ్మకమలం మొక్కకు స్థానికులు పూజలు చేశారు.

## గణపతి హాలును పునర్నిర్మించాలి


గొల్లపాలెంలో గణపతి హాలు తొలగించిన ప్రాంతం

**కాజులూరు:** కాకినాడ-కోటిపల్లి రహదారిలోని గొల్లపాలెం మార్కెట్ జంక్షన్ వద్ద కొన్నేళ్ల క్రితం తొలగించిన గణపతి హాలును అధికారులు తిరిగి పునర్నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. కరప, కాజులూరు మండలాల్లో 20 గ్రామాలకు కూడలి అయిన ఈ సెంటర్‌లో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. బస్సుల కోసం ప్రయాణికులు నిరీక్షించే సమయాల్లో సరైన షెల్టర్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో గణపతి హాలు పేరుతో ఇక్కడ ఒక భవనం ఉండేది. ఇందులో కొంత భాగాన్ని కచేరి చావిడిగా, మరికొంత ప్రయాణికులు విశ్రాంతి భవనంగా వినియోగించుకునేవారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 12 ఏళ్ల క్రితం అధికారులు హాలును తొలగించారు. తర్వాత ఆ స్థలంలో స్థానిక ఐడియల్ యూత్ సభ్యులు పాక వేసి బస్సు షెల్టరుగా ఏర్పాటు చేయగా.. క్రమేపి అది శిథిలమైంది. దీంతో బస్సు షెల్టరు లేక ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. అంతేకాకుండా హాలు స్థలం క్రమేపీ ఆక్రమణలకు గురవుతోంది. అధికారులు స్పందించి ఈ జంక్షన్‌లో హాలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**కె.గంగవరం:** నగరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రామచంద్రపురానికి చెందిన కేవీఆర్ ఆసుపత్రి, పెనుగుదురుకు చెందిన అంజన మల్టీ స్పెషాలిటీ దంత ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరం వద్ద సుమారు 300 మందికి ప్రముఖ వైద్యులు మెడికల్, దంత పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కోట సతీష్, రమ్య, సలాది వీర వెంకటేష్, బీసీ నాయకులు కడలి రాంపండు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.1.50 లక్షల విరాళం


విరాళాన్ని డీఎం ధనమ్మకు అందిస్తున్న దాత రంగరాజు

**రాజోలు:** ఆర్టీసీ ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు రాజోలు బస్టాండ్‌లో ఆర్వో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు రూ.1.50 లక్షల విరాళాన్ని దాత రుద్రరాజు రంగరాజు డిపో మేనేజర్ ధనమ్మకు ఆదివారం అందజేశారు. ఇటీవల జోన్-2 ఈడీ డిపో పరిశీలనకు వచ్చిన సందర్భంగా ప్రయాణికులకు రక్షిత తాగునీరు అందించాలని డీఎం ధనమ్మకు సూచించారు. దీంతో డీఎం ధనమ్మ, అసిస్టెంట్ మేనేజర్ కేకే దొర లక్కవరం గ్రామానికి చెందిన దాత రుద్రరాజు రంగరాజును సంప్రదించి సమస్యను వివరించారు. వెంటనే రంగరాజు ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్ఓ వాటర్ ప్లాంట్‌కు రూ.1.50 లక్షల విరాళాన్ని ఇచ్చారు. దాత రంగరాజు, ఆయన కుటుంబ సభ్యులను జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి రాఘవ కుమార్, డీఎం ధనమ్మ కృతజ్ఞతలు తెలిపారు. ముదునూరి సాయిరాజు, అరిగెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అవార్డు అందుకున్న హెచ్‌ఎం



అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వరరావు

**కె.గంగవరం:** ప్రముఖ స్వచ్ఛంద సంస్థ యంగ్ మైండ్స్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా సేవలందిస్తున్న వ్యక్తులకు అవార్డులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆదర్శ ప్రధానోపాధ్యాయ అవార్డుకు కె.గంగవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. ఆదివారం శాసనమండలి సభ్యులు గాదె శ్రీనివాసరావు, పేరాబత్తుల రాజశేఖర్ సమక్షంలో కాకినాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన అవార్డును అందుకున్నారు. 15 ఏళ్లుగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా.. 15 మంది విద్యార్థులను ట్రిపుల్ ఐటీకి ఎంపికైయ్యేలా కృషి చేసినందుకు ఈ అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గిరజాల వీఎస్ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ నాగరాజు, చోడిశెట్టి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్న అధికారులు


ఉమ్మిడిశెట్టి వీరవేణి

**కపిలేశ్వరపురం:** మండలంలోని టేకీ గ్రామంలో కూటమి నేతల ప్రోద్బలంతో అధికారులు ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్నారని ఎంపీటీసీ సభ్యురాలు ఉమ్మిడిశెట్టి వీరవేణి ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం, ఆహ్వానాన్ని తనకు పంపడం లేదన్నారు. ఇటీవల పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి కూడా పిలవలేదన్నారు. అదే విషయాన్ని మండల పరిషత్ సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. అయినప్పటికీ అధికారుల తీరులో మార్పులేదని, ఇటీవల పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కూడా పిలవలేదన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి వైఖరితో కూటమి నేతలు ఉండటం సరికాదని, వారి మాటలు విని ప్రొటోకాల్‌ను విస్మరిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి వస్తుందని ఎంపీటీసీ అన్నారు.

### దేవతామూర్తులకు సారె సమర్పణ


అంగరలో అమ్మవార్లకు సారె తీసుకెళ్తున్న భక్తులు

**కపిలేశ్వరపురం:** మండలంలోని అంగర గ్రామస్తులు ఆరాధ్యదైవంగా కొలిచే నూకాంబిక, ఆదిలక్ష్మి అమ్మవార్లకు భక్తులు సారె సమర్పించారు. మేళతాళాల మధ్య గంగుమళ్ల లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ఊరేగింపుగా సారెను తీసుకెళ్లారు. ఆయా దేవతామూర్తుల ఆలయాల్లో అర్చకుడు సంపర సుమంత్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఘనంగా అశిరాంబ జాతర


గరగలతో నృత్యం చేస్తున్న కళాకారులు

**కపిలేశ్వరపురం:** మండలంలోని అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు ఆరాధ్యదైవంగా కొలిచే అశిరాంబ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, కర్రసాము తదితర సాహస కృత్యాలతో జాతర సందడిగా సాగింది. ఇరు గ్రామాల ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కు చెల్లించారు. ఆలయ నిర్వాహక కమిటీ చైర్మన్ రాగం రామచంద్రరావు, సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### ఆర్టీసీ డిపోలో కారుణ్య నియామకం


వెంకటలక్ష్మికి చెక్కు అందజేస్తున్న రాఘవ కుమార్

**రామచంద్రపురం రూరల్:** పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తూ గతేడాది ఆగస్టు 22న మృతి చెందిన రాయవరం మండలం కురకాడపల్లి గ్రామానికి చెందిన పంపన వీరవెంకట సత్యనారాయణ కుమారుడు భాను వీరేంద్ర కుమార్‌కు రామచంద్రపురం డిపోలో కండక్టర్‌గా కారుణ్య నియామకం ఉత్తర్వులు ఇచ్చారు. అదే విధంగా ప్రభుత్వం ద్వారా వారి కుటుంబానికి రావాల్సిన రూ.7లక్షల చెక్కును సత్యనారాయణ సతీమణి వెంకటలక్ష్మికి డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు ఆధ్వర్యంలో జిల్లా ప్రజా రవాణా అధికారి రాఘవ కుమార్ ఆదివారం అందజేశారు.

### వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటుకు కృషి


వాజ్‌పేయి విగ్రహంతో నాయకులు


**కపిలేశ్వరపురం (మండపేట):** మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని మండపేటలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్టు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోటిపల్లి వీవీ సాయిరాం, జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, పట్టణ, రూరల్ కమిటీల నాయకులు తెలిపారు. ఈ మేరకు అనుమతిని ఇవ్వాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మున్సిపల్ అధికారులకు వినతిపత్రాలను ఇచ్చినట్టు వారు తెలిపారు. భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన నేతను స్మరించుకోవడం అందరి బాధ్యతగా భావిస్తున్నామన్నారు.

# ప్రతి నీటి బొట్టూ ఒడిసిపట్టు

- సాగునీటి సరఫరా, వినియోగంలో శాస్త్రీయత అవసరం
- ఖరీఫ్ పూర్తయ్యే వరకూ రైతులు జాగ్రత్తలు పాటించాలి
- రెండు నియోజవర్గాల్లో 1,01,638 ఎకరాల్లో వరి సాగు

**క్షేత్ర స్థాయిలో ఖరీఫ్ సాగు నీటి అవసరం ఇలా...**

| మండలం | గ్రామాలు | సాగు విస్తీర్ణం | అవసరమైన నీరు (మి.మీటర్లలో) |
|---|---|---|---|
| రామచంద్రపురం | 25 | 19,105 | 2,38,81,250 |
| కె.గంగవరం | 26 | 15,860 | 1,98,25,000 |
| కాజులూరు | 26 | 9,255 | 2,40,68,750 |
| మండపేట | 12 | 16,892 | 2,11,15,000 |
| రాయవరం | 12 | 14,646 | 1,83,07,500 |
| కపిలేశ్వరపురం | 19 | 15,880 | 1,98,50,000 |
| మొత్తం | 120 | 1,00,667 | 11,58,33,750 |


తాపేశ్వరం లాకులు

**కపిలేశ్వరపురం:** వరిసాగులో సాగునీటి సరఫరా అత్యంత కీలకమైనది. ఖరీఫ్ సాగు నాట్లు పూర్తయిన నాటి నుంచి పంట చేతికందే వరకూ సాగునీటిని పంట పరిస్థితుల ఆధారంగా ప్రణాళికాబద్ధంగా అందించాలి. ఖరీఫ్ ఆరంభం నుంచి నీటి వినియోగంలో రైతులు శాస్త్రీయతను అవలంబించాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రతి ఎకరాకు సాగునీరందించి తీరుతామని అధికారులు చెబుతున్నారు. ఆచరణలో ఆ దిశగా చర్యలు కానరావడం లేదు. కపిలేశ్వరపురం మండలంలోని నల్లూరు, వల్లూరు తదితర గ్రామాల్లోని శివారు భూములకు సాగునీరందక రైతులు యాతన పడుతున్నారు. ప్రతినీటి బొట్టునూ ఒడిసిపట్టుకుని సాగు పూర్తి చేసుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉంది.

**రెండు నియోజకవర్గాల్లో సాగు ఇలా...**

ఒక ఎకరా విస్తీర్ణంలో వరి సాగుకు 1,250 మిల్లీ మీటర్లు నీరు అవసరం. రామచంద్రపురం నియోజవర్గంలో 75 గ్రామాల్లో 54,220 ఎకరాలకు 6,77,75,000 మిల్లీమీటర్లు, మండపేట నియోజవర్గంలో 43 గ్రామాల్లో 47,418 ఎకరాలకు 4,92,72,500 మిల్లీమీటర్లు, మొత్తం రెండు నియోజకవర్గాల పరిధిలోని 120 గ్రామాల్లో 1,01,638 ఎకరాల్లో వరి సాగుకు 11,70,47,500 మిల్లీమీటర్ల సాగునీరు అవసరమవుతుంది.

### నీటి వినియోగంలో అవగాహన అవసరం



సాగునీరు విలువను ప్రతి రైతు గుర్తించాలి. వరి సాగు మొత్తం కాలానికి ఎంత మేరకు నీరు అవసరమో దశల వారీగా అవగాహన కలిగి ఉండాలి. అందుకోసం పాత పద్ధతులను విడనాడి శాస్త్రీయ పద్ధతిలో సాగునీటిని వినియోగించుకోవాలి. సాధారణంగా ఎగువ భూములున్న రైతులు ఎక్కువ నీటిని వినియోగిస్తుండటంతో పల్లపు ప్రాంతాల రైతులకు సమస్య ఎదురవుతుంది. దీంతో వారి భూముల్లో దిగుబడి తగ్గే పరిస్థితులొస్తాయి. నేలలో పైరుకు తడి 75 శాతం వరకూ తగ్గిపోతే నీటి ఎద్దడి ఉందంటారు. అలాగని అవసరం రాకుండా ముందస్తుగా నీరును పెట్టినా ప్రాణవాయువు దక్కక పంట దిగుబడి తగ్గిపోతుంది. నాట్లు వేసేటప్పుడు నీరు పలుచగా, మూన తిరిగిన రోజు నుంచి పైరు దుబ్బు కట్టడం పూర్తయ్యే వరకూ 2 సెంటిమీటర్ల నీరు పొలంలో ఉంటే సరిపోతుంది. చిరుపొట్ట దశ నుంచి గింజ గట్టిపడే వరకూ 5 సెం.మీ నీరుండాలి. ఈనిక దశ, చిరుపొట్ట దశల్లో ఎట్టి పరిస్థితిల్లో నీటి ఎద్దడి లేకుండా జాగ్రత్త వహించాలి. కోతకు పది రోజులు ముందుగా నీటిని నెమ్మదిగా తగ్గించాలి. నీరు ఎక్కువగా ఉంటే పైరు దుబ్బు చేయదు. ఏ దశలో ఎంత మేరకు నీరు పెట్టాలన్న అంశంపై ఎప్పటికప్పుడు గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి.

– కేవీఎస్ రమేష్ కుమార్, ఏఓ, రాయవరం మండలం